క్లుప్తంగా

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



కమ్మర్‌పల్లి: రాష్ట్రంలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం. నరేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కోనసముందర్ బాలికల వసతి గృహంలో పోరుబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు కలిపి దాదాపు రూ. 8 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇంటర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు, ఉచితంగా బస్ పాస్‌లు అందజేయాలన్నారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్, కార్యదర్శి దుర్గాప్రసాద్, నాయకులు నిఖిల్, రాజు, బాలకృష్ణ, వినయ్, వెంకట్, వివేక్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ నాయకులు సారా సురేశ్ అశోక్ పాల్గొన్నారు.

నవీపేట పద్మశాలి సంఘం కార్యవర్గం ఎన్నిక

నవీపేట : నవీపేట పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వి. గంగా కిషన్, ప్రధాన కార్యదర్శిగా కస్తూరి రాజేందర్, కోశాధికారిగా గుముడాల రాజేందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అల్లి గంగాధర్, ఉపాధ్యక్షులుగా భీమర్తి మోహన్, దాసరి నర్సయ్య, పుట్టోల్ల గోవింద్, మార దామోదర్ లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన ప్రతినిధులకు మండల అధ్యక్షులు లోకం నర్సయ్య, ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మండల నాయకులు మేక లక్ష్మణ్, మ్యాథరి నర్సయ్య మేక రమేష్ లు పాల్గొన్నారు.

యువజన కమిటీ ఏర్పాటు

నవీపేట పట్టణ పద్మశాలి యువజన సంఘాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా గైనివార్ మురళి, ప్రధాన కార్యదర్శిగా కస్తూరి మోహన్, కోశాధికారిగా గురుదేవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నవీన్ లు ఎన్నికయ్యారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత

ఆర్మూర్‌టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు అందించినట్లు ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణగౌడ్ తెలిపారు. ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి ఐదుగురు బాధితులకు అందజేశారు.

హనుమాన్ ఆలయంలో 'స్వచ్ఛ భారత్'



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్టు కాలనీలోని హనుమాన్ ఆలయ ఆవరణలో ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకే శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రతి ఆదివారం తమ పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి, మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శివరాజ్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు కొక్కెర భూమన్న, నిశాంత్, మధుసూదన్, నరేందర్, గంగారం తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల కోసం స్టాండ్ విరాళం



మోర్తాడ్: ఏర్గట్లలోని వివిధ గణేశ్ మండపాళ్ల కోసం ఇనుప స్టాండ్‌ను అందుబాటులో ఉంచిన డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్‌ను ఆదివారం గ్రామంలోని యువజన సంఘాల ప్రతినిధులు సత్కరించారు. 17 ఫీట్ల ఇనుప స్టాండ్‌ను ఎప్పుడు అంటే అప్పుడు వినియోగించుకోవడానికి వీలుగా తయారు చేయించి రాయల్ గాయ్స్ యూత్‌కు అప్పగించారు. వీరు గ్రామంలోని ఏ సంఘానికైనా ఇచ్చి మళ్లీ తీసుకునేలా ఏర్పాటు చేశారు. ఆదర్శ యూత్, సహృదయ యూత్, రాయల్ గాయ్స్ యూత్, యంగ్ ఫైర్స్ యూత్, శివాజీ గాయ్స్ యూత్, వీ కింగ్స్ యూత్, రాయల్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

బడికి నిధులేవీ?

- పాఠశాలల స్టేషనరీకి నిధుల కొరత
- విడుదల కాని నిర్వహణ గ్రాంట్
- సొంత డబ్బులు వెచ్చించి సౌకర్యాలు సమకూరుస్తున్న టీచర్లు



అయిలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

నందిపేట్(ఆర్మూర్): సర్కార్ బడుల నిర్వహణకు ప్రభుత్వం ఏడాదికి రెండు పర్యాయాలు స్కూల్ గ్రాంటు కింద నిధులు మంజూరు చేస్తుంది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమయినప్పటికీ ఇప్పటి వరకు స్టేషనరీ కొనుగోలుతో పాటు పాఠశాలల నిర్వహణకు నిర్దేశించిన మెయింటేనెన్స్, స్కూల్ గ్రాంట్ నిధులు విడుదల కాలేదు. ఫలితంగా రిజిస్టర్లు, డస్టర్లు, చాక్‌పీసుల కొనుగోలుకు ఆయా పాఠశాలల ప్రధ్యానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొన్ని పాఠశాలల్లో టీచర్లే సొంత డబ్బులు వెచ్చించి కొంతమేర సౌకర్యాలు సమకూర్చుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. గతంలో విద్యార్థుల సంఖ్యను బట్టి మెయింటేనెన్స్ స్కూల్ గ్రాంట్‌లను ప్రభుత్వం విడుదల చేసేది. ఈ విద్యా సంవత్సరం బడులు తెరిచి మూడు నెలలు గడుస్తున్నా నిధులను విడుదల చేసే విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

ఉమ్మడి నందిపేట మండలంలో పాఠశాలలు

నందిపేట మండలంలో మొత్తం 40 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో పీఎస్ 24, యుపీఎస్ 2, హైస్కూల్స్ 11, కేజీబీవీ 1, మోడల్ 1, ఎంజేపీటీ 1 పాఠశాలలు ఉన్నాయి. అలాగే డొంకేశ్వర్ మండలంలో 20 పాఠశాలలున్నాయి. ఇందులో పీఎస్ 13, యుపీఎస్ 1, హైస్కూల్స్ 6 ఉన్నాయి. ఉమ్మడి మండలాల పరిధిలోని పాఠశాలలో సుమారు 2 వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం ఏటా రెండు విడుతలుగా అందించే గ్రాంట్‌తో పాఠశాలల్లో చాక్‌పీస్‌లు మొదలుకుని హాజరు రిజిస్టర్లు ఇతర అవసరమైన సామగ్రి ప్రయోగశాలల రసాయనాలను పాఠశాల నిధుల నుంచే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు నిధులు విడుదల చేయని కారణంగా బడుల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పతున్నాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

మంజూరు కావాల్సిన నిధులు

విద్యార్థుల సంఖ్య	రావాల్సిన మొత్తం
1 నుంచి 30 మంది	రూ. 10 వేలు
31 నుంచి 100 మంది	రూ. 25 వేలు
101 నుంచి 250 మంది	రూ. 50 వేలు
251 నుంచి 1000 మంది	రూ. 75వేలు

నిధులు మంజూరు కాలేదు



గతేడాది చివరి వరకు పాఠశాల నిర్వహణ నిధులు వచ్చాయి. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి ఇంకా ప్రభుత్వం నుంచి గ్రాంటు విడుదల కాలేదు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు చూస్తున్నారు. సౌకర్యాలు కల్పిస్తున్నాం

– అవదూత గంగాధర్, ఎంఈవో, నందిపేట

ఆహ్లాదం ఎక్కడ...?

- బోధన్‌లో మూతపడిన గాంధీ పార్కు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



బోధన్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో గాంధీ పార్కు గేట్లకు వేసిన తాళం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని 38 వార్డుల్లో లక్షకు పైగా జనాభా ఉంది. ఆహ్లాదం కోసం ప్రజలు సేద తీరడానికి పార్కులు కరువయ్యాయి. బోధన్ డివిజన్ కేంద్రంగా 1956లో ఏర్పడింది. సాధారణ వసతులతో ఉన్న గాంధీ పార్కు లీజు గడవు ముగియడంతో సదరు కాంట్రాక్టర్ నుంచి బల్దియా అధికారులు 15 రోజుల క్రితం పార్కును స్వాధీనం చేసుకున్నారు. గేటుకు తాళం వేశారు. బోధన్ పట్టణానికి నిత్యం బోధన్ పట్టణ, మండల ప్రజలతో పాటు, ఎడపల్లి, కోటగిరి, రెంజల్, పోతంగల్, రుద్రూర్, బాన్సువాడ, ప్రాంతాల ప్రజలే కాకుండా పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి ప్రజలు విద్యా,వైద్యం, వ్యాపారం కోసం రాకపోకలు సాగిస్తుంటారు. ఆదివారం బోధన్‌లో సంత ఉండడంతో అనేక మంది ఇతర గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇక్కడ క్రయవిక్రయాలు నిర్వహించేందుకు వస్తారు. పట్టణంలో పార్కులు ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు చర్యలు చేపటాల్సిన బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఆరు ఏళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణంలోని వివిధ వార్డుల్లో ఖాళీ స్థలాలను గుర్తించి రూ. లక్షలు కేటాయించి పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. శక్కర్‌నగర్ కాలనీలోని 23వ వార్డులో పార్కును ఏర్పాటు చేశారు. పార్కు స్థలానికి ప్రహరీ నిర్మించారు. పార్కులో ఆటవస్తువులను మాత్రం ఏర్పాటు చేయలేదు. బల్దియా అధికారులు స్పందించి వార్డుల్లో పార్కులు ఏర్పాటు చేయాలని, అలాగే పార్కుల్లో పిల్లలు ఆడుకోవడానికి ఆటవస్తువులను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి

పట్టణంలోని పార్కుల అభివృద్ధికి కృషి చేస్తాం. పట్టణంలోని గాంధీ పార్కు లీజు ముగియడంతో సదరు కాంట్రాక్టర్ నుంచి స్వాధీనం చేసుకున్నాం. త్వరలో టెండర్ ప్రక్రియ నిర్వహించేందుకు చర్యలు చేపడుతాం.

– జాదవ్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్

నవాబు ఎత్తిపోతలకు నీటిని విడుదల చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వేల్పూర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు లక్ష్మికాలువ నీటితో వేంపల్లి లిఫ్టును, దాని ద్వారా నీరందించే నవాబు ఎత్తిపోతలతో వేల్పూర్ మండల గ్రామాల చెరువులు నింపాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రైతువిభాగం జిల్లా నాయకుడు మిట్టపల్లి మహిపాల్, అంక్సాపూర్ మాజీ సర్పంచ్ ఎడ్ల రాజేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ సుంకెట పెద్దమల్లారెడ్డి, నాయకులు కిరణ్‌గంగయ్య, దేగాం తిరుపతి ఆదివారం అంక్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 7న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి లక్ష్మికాలువకు నీటిని విడుదల చేసినప్పటికీ వేంపల్లి లిఫ్టుకు నీటిని ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు. వేంపల్లి లిఫ్టు డి–3 ద్వారా నవాబు చెరువుకు నీరందితే, అక్కడి నుండి లిఫ్టుతో వేల్పూర్, వెంకటాపూర్, కుకునూర్, కోమన్‌పల్లి, అంక్సాపూర్, లక్కోర, సాహెబ్‌పేట్, మోర్తాడ్ మండలం దొన్కల్ గ్రామాల చెరువులు నిండుతాయని పేర్కొన్నారు. బోరుబావుల్లో చేరిన అరకొర నీటితో రైతులు సాగునీరు సరఫరా చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

జంగ్‌సైరన్ మోగించాలి



ఆర్మూర్‌టౌన్: ఉద్యోగుల హక్కుల సాధన కోసం జంగ్ సైరన్ మోగించాల్సిన అవశ్యకత ఉందని ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్ టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో ఎస్ఆర్ఎపీ, భీంగల్ టీఎన్జీవో నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినంగా భావించి జిల్లాలోని అన్ని కార్యాలయ ముందు నల్లబ్యాడ్జి ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 11న జిల్లాకు వస్తున్న బస్సుయాత్రను స్వాగతం పలకాలన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి శేఖర్, టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, యూనిట్ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, శశికాంత్‌రెడ్డి, శృజన్, సాయికృష్ణ, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అడవుల నరికివేత

- వర్ని మండలంలో ఫారెస్టు భూముల కబ్జాకు పాల్పడుతున్న గిరిజనులు
- కేసులు నమోదైనా ఆగని ఆక్రమణలు



పులి క్యాంపు అటవీ ప్రాంతంలో నరికివేసిన చెట్లు

వర్ని: మండలంలోని అటవీ ప్రాంతంలో గిరిజనులు యథేచ్ఛగా అడవులను నరికివేస్తున్నారు. జాకోరా, బడాపహాడ్, పులి క్యాంపు, పొట్టిగుట్ట, సిద్దాపూర్, పైడిమల్ శివార్లలోని అటవీ ప్రాంతంలో రాత్రి సమయాల్లో చెట్లను నరికివేసి ఆక్రమణకు పాల్పడుతున్నారు. ఇదివరకే వందల ఎకరాలను నరికివేసి కబ్జాకు పాల్పడగా ప్రభుత్వం పోడు భూముల పేరిట పట్టాలు ఇచ్చింది. తాజాగా చెట్లను ఎవరు నరకవద్దని అటవీ భూమిని కబ్జాకు పాల్పడవద్దని అటవీశాఖ అధికారులు స్పష్టం చేశారు. కొందరు అవేమీ పట్టనట్టు వందల ఎకరాల్లో చెట్లను నరికివేసి కబ్జాకు పాల్పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అటవీశాఖ అధికారులు బాధ్యులపై కేసులు నమోదు చేసిన ఆక్రమణలు మాత్రం ఆగడం లేదు. పులి క్యాంపు శివారులో వారం క్రితం వందల చెట్లను నరికి వేశారు. అటవీ శాఖ అధికారులు నిఘా పెంచి చెట్లను నరికి వేయకుండా చర్యలు చేపట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిఘా ఏర్పాటు చేస్తాం

అడవులను నరకవద్దని అవగాహన కల్పించిన ప్రజల్లో మార్పు రావడం లేదు. గ్రామాల్లో సమావేశాలు పెట్టి అడవులను నరికితే జరిగే అనర్థాలు, కేసుల నమోదు వివరించాం. ఏడాదిలో 50 మందిపై కేసులు నమోదు చేశాం. అడవులను నరకకుండా గట్టి నిఘా ఏర్పాటు చేస్తాం.

– గంగాధర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వర్ని

శిథిలావస్థలో జోర్‌పూర్ పాఠశాల



జోర్‌పూర్ పాఠశాలలో పెచ్చులు ఊడిన స్లాబ్



తరగతి గదిలో గోడకు పగుళ్లు



పాకురు పట్టిన గోడలు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం జోర్‌పూర్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. పాఠశాల పై కప్పు స్లాబ్ పెచ్చులు ఊడి పడడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. తరగతి గదులలోని గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 25 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఐదు తరగతులకు ఒకే గది ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురువుతున్నారు. ఉన్న గది శిథిలావస్థకు చేరడంతో విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలకు మరమ్మతులు చేయించాలని లేదా, అదనపు గదులను నిర్మించాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు సమగ్ర వ్యక్తిత్వ వికాస కార్యక్రమం

రుద్రూర్ : మండల కేంద్రంలోని శశిరేఖ గార్డెన్‌లో సోమవారం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సమగ్ర వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రైడ్స్ అధ్యక్ష కార్యదర్శులు కె. కృష్ణ , పి.శేఖర్ తెలిపారు. కార్యక్రమం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమవుతుందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ముప్కాల్‌లో బస్టాండ్ కరువు



ముప్కాల్ మండల కేంద్రంలో రోడ్డుపై నిలబడిన ప్రయాణికులు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ముప్కాల్ మండల కేంద్రం వద్ద రెండు చోట్ల బస్సులను నిలిపేవారు. జాతీయ రహదారి 44 రోడ్డు విస్తర్ణ పనులు సాగుతుండటంతో మండలంలోని కొత్తపల్లి మీదుగా ట్రాఫిక్ మళ్లించారు. దీంతో గాంధీ వద్ద మాత్రమే బస్సులను నిలుపుతున్నారు. జాతీయ రహదారి కావడంతో పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రయాణికులు ఇక్కడే బస్సు కోసం వేచి చూస్తారు. ఈప్రాంతంలో బస్టాండ్‌కు సంబంధించిన ఎలాంటి వసతులు లేవు. ముప్కాల్‌లో బస్టాండ్ భవనం నిర్మించి మూత్రశాలలు, మరుగుదొడ్లు సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు, మండల ప్రజలు కోరుతున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: ప్రతి వస్తువుపై కేంద్రం ప్రభుత్వం పన్నులు విధించి ప్రజల నడ్డి విరుస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30న ఆర్మూర్‌లోని సైదాబాద్‌కాలనీలో సుంకాలు, వ్యవసాయ రంగంపై ప్రభావం, సహకార వ్యవస్థ పునర్జీవం అనే అంశాలకు సంబంధించిన జిల్లా సెమినార్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో ఆదివారం ఈసెమినార్‌కు సంబంధించిన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. మారుతున్న వాతావరణానికి అనుగుణంగా వ్యవసాయ పరిశోధనలను అభివృద్ధి చేయాలన్నారు. ఈసెమినార్‌ను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, భూమన్న, ఎర్రన్న, సుదర్శన్, రమేష్, శ్రీనివాస్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై, సీఐలపై ఫిర్యాదు

రెంజల్: రెంజల్ ఎస్సై, బోధన్ రూరల్ సీఐపై మండలంలోని వీరన్నగుట్ట గ్రామానికి చెందిన సురేందర్‌గౌడ్ బోధన్ ఏసీపీతో పాటు సీపీలకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచక్షణా రహితంగా కొట్టి గాయపర్చడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆదివారం విలేకరులతో తెలిపాడు. భార్య, భర్తలకు కుటుంబ కలహాలు ఉన్నాయని గ్రామానికి చెందిన సురేందర్‌గౌడ్ పేర్కొన్నారు. తన భార్య సుమలత అందించిన ఫిర్యాదుతో తనను స్టేషన్‌కు పిలిపించి ఎస్సై చంద్రమోహన్‌తో పాటు రూరల్ సీఐ విజయ్‌బాబులు అసభ్య పదజాలంతో బూతులు తిడుతూ చితకబాదారని ఆరోపించాడు. ఈ విషయమై ఏసీపీ శ్రీనివాస్‌ను వివరణ కోరగా తాను లేని సమయంలో ఫిర్యాదు అందించినట్లు ఇంకా తన దృష్టికి రాలేదని ఏసీపీ పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలుసుకుంటానని పేర్కొన్నారు. ఫిర్యాదు వస్తే పరిశీలిస్తానన్నారు.

ఇరిగేషన్ శాఖలో డీఈ ఇష్టారాజ్యం?

- లస్కర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు



నిజాంసాగర్ కాల్వ

మాక్లూర్: నీటిపారుదల శాఖలో నందిపేట డీఈ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నీటిపారుదల శాఖ పరిధిలో మాక్లూర్ మండలంలో 54 చెరువులు, 68 నుంచి 78 వరకు కాల్వలు ఉన్నాయి. వీటి నిర్వహణ చూసేందుకై 18 లస్కర్లు, ఒక వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. లస్కర్లలో కొందరు మహిళలు ఉండగా వారి స్థానంలో భర్తలు పని చేస్తున్నట్టు తెలిసింది. మిగితా లస్కర్లు వారు డ్యూటీలు చేసిన చేయకపోయినా చెల్లుబాటు అవుతున్నట్టు సమాచారం. ఒక మహిళ లస్కర్‌తో డీఈ ఇంట్లో పని చేయించుకుంటున్నట్టు తెలిసింది. మరో మహిళ లస్కర్‌ను వేధించగా ఆమె రెండు నెలలపాటు డ్యూటీ చేయలేదని, మధ్యవర్తి ద్వారా సదరు అధికారితో మాట్లాడుకుని ఇటీవల నుంచి మళ్లీ అడవి మామిడిపల్లి లస్కర్‌గా డ్యూటీ చేస్తున్నట్టు సమాచారం. తాను చూసీచూడనట్లు వదిలేయాలంటే ప్రతి నెలా రూ.28 వేల వేతనం నుంచి రూ.8వేలు తనకు ఇవ్వాలని సదరు అధికారి డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు ఇస్తున్న వారిని డ్యూటీలో ఏ ఇబ్బంది పెట్టకుండా కొనసాగిస్తున్నాడని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఆరోపణలు నిజం కాదు

మాక్లూర్ మండలంలో తనపై వస్తున్న ఆరోపణల్లో నిజంలేదు. లస్కర్లను వేధించలేదు. వారే సెలవులపై వెళ్లి వచ్చారు. కొందరు లస్కర్లు వారి ఆరోగ్యం బాగా లేక వారి స్థానంలో మరొకరినిపెట్టి డ్యూటీలు చేయిస్తున్నారు. భీంగల్ నుంచి వచ్చే ఇద్దరు లస్కర్లలో ఒకరు రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో కొద్ది రోజులుగా డ్యూటీకి రావటం లేదు. నేను ఏ లస్కర్‌వద్ద డబ్బులు తీసుకోవటం లేదు.

– రవికుమార్, డీఈ, నందిపేట సబ్ డివిజన్

చిన్నాపూర్ అడవిలో సీడ్‌బాల్స్



సీడ్ బాల్స్ వేస్తున్న రావుట్ల జనార్దన్

మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్ అడవిలో ఆదివారం సిరివెన్నెల గ్రీన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రావుట్ల జనార్దన్ 30,000 సీడ్‌బాల్స్ వేశారు. పక్షులు, జంతువులకు అడవిలో ఆహారం లభించాలనే ఉద్దేశంతోనే ప్రతి సంవత్సరం అడవిలో ఆయా రకాల పండ్లు , దుంప గడ్డలకు సంబంధించి విత్తనాలను చల్లుతున్నట్టు జనార్దన్ తెలిపారు. ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి అశోక్, బీట్ అధికారి శ్రీనివాస్, రవి, కిషన్, శేఖర్, రాజేష్, కిరణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ పండుగ



సిరికొండ: మండలంలోని తూంపల్లి గ్రామంలో ఆదివారం పోచమ్మ పండుగను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతల నూతన విగ్రహాలను తయారు చేయించి ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

రోడ్డుపై పశువులు.. ప్రయాణికులకు తిప్పలు

- బాల్కొండలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



బాల్కొండ వన్నెల్(బి) చౌరస్తా వద్ద జాతీయ రహదారి పై సంచరిస్తున్న పశువులు

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో జాతీయ రహదారి 44 పై పశువులు నిత్యం గుంపు గుంపులుగా ఉండటంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంలో దేవాలయాల వద్ద మొక్కులు తీర్చుకొనుటకు వదిలిన, కొన్న ఆవులు,మరియు కొందరు పెంచుకుంటున్న పశువులు రోడ్డుకు అడ్డంగా నిత్యం పడుకుంటున్నాయి. దీంతో రోడ్డు గుండా వెళ్లే వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది.

నెలన్నర రోజుల క్రితం..

బాల్కొండ మండల కేంద్రంలో గత నెలన్నర రోజుల క్రితం రోడ్డుపై అడ్డంగా ఉన్న ఎడ్ల కొట్లాటలో మండల కేంద్రానికి చెందిన నాగరాజు గాయపడి మృతిచెందాడు. మండల కేంద్రంలో జాతీయ రహదారితో పాటు , గల్లీ రోడ్లపై కూడ పశువులు నిత్యం గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. పశువులకు షెడ్డు నిర్మించి, షెడ్డులో ఉంచాలనిమండల కేంద్ర వాసులు కోరుతున్నారు.

అపూర్వ సమ్మేళనం



వేల్పూర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన 2003–04 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం వేల్పూర్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.